# ఆత్మవిశ్వాసం

మనం ఎదుటివాళ్ళ తెలివితేటల్ని మనకి తెలీకుండానే అతి తక్కువగానో - మరీ ఎక్కువగానో అంచనా వేస్తూ ఉంటాం!

ఒకప్పుడు....

మనం చిన్నచూపు చూసినవాళ్ళు, ఎందుకూ పనికిరారనుకున్న వ్యక్తులు జీవితంలో బాగా పైకి రావడం...

తెలివైన వాళ్లూ, మేధావులూ అనుకున్న వ్యక్తులు ఎందుకూ కొరగాకుండా పోవడం... చూస్తూనే ఉంటాం !

ఏ వ్యక్తికైనా కేవలం తెలివితేటలు ఉన్నంత మాత్రాన సరిపోదు. ఆ వ్యక్తికి తను చేసే పనిపట్ల ఓ కమిట్‌మెంట్, రాత్రింబవళ్ళూ కష్టపడే మనస్తత్వం ఉండాలి.

'నీ పనిమీద నీకు గల అభిమానమే నీ విజయానికి రహస్యం' అన్నాడు ఆర్థర్ కోస్లర్.

ఏదో మొక్కుబడిగా పని చేస్తూ... ఎప్పుడూ గడియారం మీద దృష్టి నిలిపే వ్యక్తి ఏ విజయాన్నీ సాధించలేడు !

ఏ పనీ చేయకుండా ఓవర్‌నైట్లో... ఏ టాటానో, బిర్లానో కావాలని కలలు కంటూ కూర్చునే యువత దేశాన్ని నిర్వీర్యం చేస్తుంది.

**'నేనీ పని చేయగలను'** అనుకుంటే అది ఆత్మవిశ్వాసం!

**'నేను ఏ పనైనా చేయగలను'** అనుకుంటే... అది అహంభావం !

**'నేను తప్ప వేరెవరూ ఈ పని చేయలేరు'** అనుకుంటే.... అది అహంకారం !

అహంభావం, అహంకారాన్ని అదుపులో పెట్టుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే యువత.... మన జాతికిప్పుడు సారధి కావాలి!



01-12-1994